సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ. 24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి. మార్కెట్‌కు 187 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.2, సరాసరిన రూ.5 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.4°/21.6°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమికి సంబంధించిన పరిహారం వెంటనే చెల్లించాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జాతీయ రహదారులు, రైల్వే లైనుకు సంబంధించిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ 342 (పుట్టపర్తి–కోడూరు, గోరంట్ల–హిందూపురం) 716జీ (బెంగళూరు–కడప–విజయవాడ), 544డీ, 544ఈ తదితర రహదారుల పనులకు సంబంధించి అవార్డు పాస్ చేసిన భూములకు వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. చిలమత్తూరు, పుట్టపర్తి, ఓడీ చెరువు తహసీల్దార్లు వెంటనే ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్తీక్, పుట్టపర్తి, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, ఎన్‌హెచ్ డీఈ జగదీష్‌గుప్తా, మురళీమోహన్, సంబంధిత తహసీల్దార్లు పాల్గొన్నారు.

19 నుంచి డీఎడ్ పరీక్షలు

రాప్తాడు రూరల్: డీఎడ్ మొదటి సెమిస్టర్, నాల్గో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 25 వరకు ఉంటాయని డీఈఓ నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెమిస్టర్, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నాల్గో సెమిస్టర్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు గంటముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

సచివాలయ ఉద్యోగాల కోసం 23 మంది అంగీకారం

అనంతపురం సిటీ: గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉద్యోగాల కోసం 23 మంది ముందుకొచ్చారు. కోవిడ్ బారిన పడి మృతి చెందిన 32 మంది ఉద్యోగుల వారసులకు సచివాలయాల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు వారి వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి సంకల్పించారు. బాధిత కుటుంబాల వారికి వ్యక్తిగతంగా ఫోన్లు చేసి, ఆప్షన్లు ఇవ్వాలని జెడ్పీ ఉద్యోగులు సమాచారం అందించారు. దీంతో 23 మంది తాము సచివాలయ ఉద్యోగాలకు అంగీకార పత్రాలు సమర్పించారు. ఇంకా పది మంది మిగిలి ఉన్నారు. వారికి మరోసారి ఫోన్లు చేసి, సమాచారం తెలిపారు. ఇప్పటి వరకూ అంగీకార పత్రాలు సమర్పించిన వారికి సంబంధించి సమగ్ర నివేదికలు తయారు చేస్తున్నారు.

మీ దగ్గరకే మేమొస్తాం!

ఏదైనా సమస్య ఉంటే గతంలో ప్రజలే మండల కేంద్రాలకు వెళ్లి అర్జీ ఇచ్చేవారు. అక్కడ పరిష్కారం కాకపోతే జిల్లా కేంద్రానికి వెళ్లేవారు. కానీ ఇప్పుడు సీఎం జగన్ అధికారులనే ప్రజల వద్దకు పంపుతున్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ఇక నుంచి మండల కేంద్రాల్లో నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా స్థాయి అధికారులు పాల్గొనాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

- సమస్యల పరిష్కారానికి ప్రజల చెంతకే యంత్రాంగం
- ఇక నుంచి మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం'
- సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం
- 15న నల్లమాడలో కార్యక్రమం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తోంది. అదే రోజు డివిజన్, మండల స్థాయి, సచివాలయాల్లో సైతం కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరిస్తున్నారు. అయితే ఏదైనా సమస్య మండల స్థాయిలో పరిష్కారం కాకపోతే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ప్రజలకు వ్యయప్రయాసలు తప్పడం లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం 'స్పందన' తరహాలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం తీసుకువచ్చింది. ఇందుకోసం 1902 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కరిస్తోంది. అలాగే జిల్లా స్థాయిలోనూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తోంది. దీన్ని ఇప్పుడు మండల కేంద్రాలకూ విస్తరించింది. ప్రతి బుధ, శుక్రవారాల్లో ఏదో ఒక మండల కేంద్రంలో కార్యక్రమం నిర్వహించనుంది. జిల్లా స్థాయి అధికారులంతా పాల్గొననుండటంతో ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభించనుంది.

నల్లమాడ నుంచి ప్రారంభం

ప్రజల చెంతకే వెళ్లి అర్జీలను స్వీకరించే కార్యక్రమాన్ని ఈనెల 15న పుట్టపర్తి నియోజక వర్గంలోని నల్లమాడ నుంచి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం విధి విధానాల గురించి కలెక్టర్ అరుణ్ బాబు, జేసీ చేతన్ సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి 'స్పందన'లో అధికారులకు వివరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించే 'స్పందన' కార్యక్రమంలో కొన్ని మండలాల నుంచి ఫిర్యాదులు రిపీట్ అవుతున్నాయని, అందువల్ల మండల కేంద్రాలకే జిల్లా అధికారులు వెళ్లడం ద్వారా అలాంటి సమస్యలు మరోసారి రాకుండా పరిష్కరించే వీలు కలుగుతుందన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయం చేసుకుని మండల కేంద్రాల్లో నిర్వహించే 'జగనన్నకు చెబుదాం'ను విజయవంతం చేయాలని సూచించారు.

మండలవాసులకే అవకాశం

ఏ మండలంలో కార్యక్రమం నిర్వహిస్తే ఆ మండల ప్రజల నుంచే అర్జీలు స్వీకరించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల అర్జీలు తక్కువగా ఉంటాయని, పైగా జిల్లా అధికారులంతా కార్యక్రమంలో పాల్గొంటుండగా సమస్యలకు అక్కడే పరిష్కారం చూపే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల కేంద్రాలతో పాటు సచివాలయ స్థాయిలో ప్రతి సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వీటితో పాటు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా మరింత మెరుగైన సేవలందిస్తోంది. అలాగే 1902 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఎలాంటి సమస్యకైనా పరిష్కారం చూపుతోంది. ఏవరైనా సరే 1902కు ఫోన్ చేసి సమస్య చెబితే..అది పరిష్కారమయ్యే వరకూ నేరుగా సీఎం కార్యాలయమే మానిటర్ చేస్తోంది. దీనిపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

ఈ నెలలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహణ ఇలా..

ఎప్పుడు	ఎక్కడ
15వ తేదీ	నల్లమాడ
20వ తేదీ	గోరంట్ల
22వ తేదీ	కొత్తచెరువు
27వ తేదీ	బుక్కపట్నం
29వ తేదీ	పుట్టపర్తి
అక్టోబర్ 3	ఓడీ చెరువు

ఇంకా సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఎవరైనా ఉంటే స్థానికంగానే వారి సమస్యలు పరిష్కరించేందుకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మండల కేంద్రాలకు తీసుకెళ్లి అక్కడే జిల్లా అధికారులను సమాయత్తం చేసి అర్జీలు స్వీకరించనున్నారు.

ప్రజలకు సౌకర్యాలు

మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. నీడ కోసం షామియానా, తాగునీరు, కూర్చోవడానికి కుర్చీలు, ఫిర్యాదులు రాయడానికి అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మండల స్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈనెల 15వ తేదీన నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయంలో ఉంటుంది. ఏ మండలంలో కార్యక్రమం ఉంటే ఆ మండల వాసుల నుంచే అర్జీలు స్వీకరిస్తాం. కార్యక్రమంలో జిల్లా అధికారులంతా పాల్గొంటారు.

– అరుణ్‌బాబు, కలెక్టర్

ప్రజలకు ఎంతో మేలు



'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఏదైనా సమస్య ఎదుర్కొనే మారుమూల గ్రామాల వారు జిల్లా కేంద్రానికి వెళ్లి ఉన్నతాధికారులకు అర్జీ ఇవ్వాలంటే ఎంతో వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. మండల కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పాయి. తొలిసారి మా నల్లమాడ మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తుండటం సంతోషకరం.

–కె. వేణుగోపాల్, నల్లమాడ

చంద్రబాబు పాపాలకు శిక్ష తప్పదు

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన పాపాలు అన్నీ ఇన్నీ కాదని, వాటన్నింటికీ శిక్ష తప్పదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఒక సామాన్యుడిగా రాజకీయాల్లోకి వచ్చిన చంద్రబాబు.. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్ పంచన చేరి ఆయనకే వెన్నుపోటు పొడిచారన్నారు. ఎన్టీఆర్‌ను పదవీచ్యుతున్ని చేయడంతో పాటు పార్టీని లాక్కుని ఆయన మరణానికి కారణమయ్యాడన్నారు. నాటి నుంచి నేటి వరకు అధికారాన్ని అడ్డు పెట్టుకుని చంద్రబాబు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. రూ.వేల కోట్ల ప్రజా ధనాన్ని దోచుకున్నాడన్నారు. ఎవరైనా కేసు పెడితే వెంటనే స్టే తెచ్చుకుంటూ ఇన్నాళ్లూ సమాజంలో నిజాయితీ పరునిగా చెలామణి అయ్యారన్నారు. అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదన్నారు. అందుకే ఇప్పుడు 'స్కిల్' స్కాం కేసులో అడ్డంగా దొరికిపోయి జైలు పాలయ్యాడన్నారు. కోర్టులో వాదనల తర్వాతే రిమాండ్ విధించారన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ కక్ష లేదన్నారు. అయినప్పటికీ టీడీపీ నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వారికి కూడా త్వరలోనే అన్ని నిజాలు తెలుస్తాయన్నారు. అప్పుడు చంద్రబాబు వెంట నడిచే వారుండరని, రానున్న రోజుల్లో టీడీపీ పతనం ఖాయమన్నారు.

అభ్యంతరాలన్నీ పరిశీలిస్తున్నాం



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలన్నీ పక్కాగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా సమీక్షించారు. ఇంటింటి సర్వే, నకిలీ ఓటర్ల నమోదు, మృతుల ఓట్ల తొలగింపు, ఎపిక్ కార్డుల జారీ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇంటింటి సర్వే పూర్తి చేశామని, వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన జరుగుతోందన్నారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరణించిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, డబుల్ ఎంట్రీలను ఒకటికి రెండు సార్లు పరిశీలిస్తున్నామన్నారు. ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారన్నారు. పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేసిన భవనాలను పరిశీలించి వాటి స్థితి గతులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ర్యాంపుల ఏర్పాటు తదితర వాటిని పరిశీలించి తగిన చర్యలు చేపట్టారన్నారు. సమీక్షలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, తిప్పేనాయక్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కర్, ఎన్నికల డీటీ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- తొలి విడతగా ఆరోగ్యశిబిరాల ప్రచారం, హెల్త్ సర్వే
- రెండో విడతలో శిబిరాల ఏర్పాటు, చికిత్స
- జిల్లా నోడల్ అధికారి శివశంకర్ బాబు



మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి శివశంకర్ బాబు

ప్రశాంతి నిలయం: గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్ల వద్దకే వెళ్లి జబ్బులున్న వారిని గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష'ను తీసుకొస్తోందని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా నోడల్ అధికారి శివశంకర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలో ఈ నెల 15న ప్రారంభం అవుతుందన్నారు. మంగళవారం ఆయన ప్రశాంతి గ్రాంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండు విడతలుగా ఉంటుందన్నారు. తొలివిడతలో ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకూ 15 రోజుల పాటు ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల సమాచారాన్ని ప్రజలకు అందిస్తారన్నారు. అలాగే ప్రతి ఇంట్లోనూ ఆరోగ్య సమస్యల గురించి ఆరా తీస్తారన్నారు. అనారోగ్య సమస్యలున్న వారికి టోకెన్లు మంజూరు చేయడంతోపాటు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. రెండో విడతలో భాగంగా సెప్టెంబర్ 30వ తేదీ నుంచి 15 రోజుల పాటు గుర్తించిన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి టోకెన్లు అందుకున్న రోగులకు అవసరమైన చికిత్సలు అందిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 379 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 6 అర్బన్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య శిబిరాలు ఉంటాయన్నారు. ప్రతి వైద్య శిబిరంలో ఇద్దరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు సేవలు అందిస్తారన్నారు.

7 రకాల పరీక్షలు, 105 రకాల మందులు

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 7 రకాల పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తారని జిల్లా నోడల్ అధికారి శివశంకర్ బాబు తెలిపారు. మందులు అవసరమైన వారికి అందించేందుకు 105 రకాల మందులను సైతం ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగి మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారన్నారు. వైద్య శిబిరాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తారన్నారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీ, డిప్యూటీ తహసీల్దార్లతో ఏర్పాటైన ప్రత్యేక బృందాలు వైద్య శిబిరాలకు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తాయన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, జిల్లా అంధత్వ నివారణ అధికారి అనురాధ, పెనుకొండ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దే!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన

శిబిరం చిరునామా:
శ్రీసాయి విద్యానికేతన్ సాయిగీతా స్కూల్, డో.నంబర్ : 2/189, పెద్ద బజారు, పుట్టపర్తి.
ఫోన్ నంబరు : 9912220726

బాలయ్యా నోరు అదుపులో పెట్టుకో

- అవినీతి పరుడిని అరెస్టు చేస్తే అంత కోపమెందుకు?
- వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక



మాట్లాడుతున్న టీఎన్ దీపిక, చిత్రంలో చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి తదితరులు

హిందూపురం: '' మీ బావ చంద్రబాబు జైలు కెళ్లాడన్న అక్కసుతో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నావ్. 'స్కిల్' స్కాంలో అధికారులు అన్ని రకాలుగా విచారించిన తర్వాతనే అవినీతి జరిగిందని తేల్చి అందుకు కారకుడైన మీ బావ చంద్రబాబును అరెస్టు చేశారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు.. కాదు..కూడదు ఇలాగే మాట్లాడతానంటే చూస్తూ ఊరుకోబోం.. జాగ్రత్త'' అని వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక ఎమ్మెల్యే బాలకృష్ణనును హెచ్చరించారు. మంగళవారం ఆమె స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నోరు తెరిస్తే తమకు చరిత్ర ఉందంటున్న బాలకృష్ణ చరిత్ర రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. కన్నతండ్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతున్ని చేసి ఘోరంగా అవమానించినప్పుడు కనీసం ఒక్క మాట మాట్లాడని బాలకృష్ణ.. ఇప్పుడు బావ కోసం పడుతున్న బాధలు..చేస్తున్న సవాళ్లు అందరూ గమనిస్తున్నారన్నారు. హిందూపురం ప్రజలు రెండు సార్లు అసెంబ్లీకి పంపితే... కనీసం వాళ్లు ఎలా ఉన్నారో అని పట్టించుకునే సమయం లేని బాలయ్య... బావ కోసం మాత్రం షూటింగ్‌లు వదిలేసి అగమేఘాలపై వచ్చి మాట్లాడున్నాడన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టించుకోని ఏకైక ఎమ్మెల్యే బాలకృష్ణనేనన్నారు. 8 నెలలుగా నియోజకవర్గం వైపు తొంగిచూడని బాలకృష్ణకు ప్రజల బాగోగులు ఎలా తెలుస్తాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తున్న బాలకృష్ణ... ఆ కుటుంబం ఆయనకు ఎంత మేలు చేసిందో మరచిపోకూడదన్నారు. ఆనాడు వైఎస్సార్ దయ చూపక పోయి ఉంటే ఏన్నేళ్లు జైలులో మగ్గేవాడివో ఒకసారి ఆలోచించుకోవాలని బాలకృష్ణకు హితవు పలికారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి మాట్లాడుతూ..నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచిన ఘనత బాలకృష్ణదన్నారు. పండుగకో, పబ్బానికో..వచ్చిపోయే ఎమ్మెల్యే బాలకృష్ణ.. 'పురం' ప్రజల బాగోగులను ఎప్పుడో విస్మరించారన్నారు. అందువల్లే ప్రజలు కూడా ఆయన్ను మరచిపోయారన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు శివ, రామచంద్రా, షాజియా, ముత్తవల్లి కలీం, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ కోర్సులో యువతకు ఉచిత శిక్షణ

పెనుకొండ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులు. స్కిల్ హబ్ సెంటర్‌లో మూడు నెలల పాటు శిక్షణ, అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. వివరాలకు 96767 06976 నంబరులో సంప్రదించవచ్చు.

నాలుగు ద్విచక్ర వాహనాలకు నిప్పు


కాలి బూడిదైన ద్విచక్రవాహనాలు

హిందూపురం అర్బన్: స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో నాలుగు ద్విచక్ర వాహనాలకు దుండగులు నిప్పు పెట్టారు. ఆబాద్ పేటలో నివాసముంటున్న ఫక్రుద్దీన్, అతని కుమారులకు చెందిన రెండు ద్విచక్ర వాహనాలు, ఆనందాచారి, షఫీకి చెందిన మరో రెండు ద్విచక్ర వాహనాలకు మంగళవారం వేకువజామున నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఇంట్లో పడుకున్న వారు బయటకు వచ్చి మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్ హరూన్‌బాషా తెలిపారు. కాగా, వాహనాల కాల్చివేతకు సంబంధించి ఇప్పటికే కొందరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ప్రమాదాలు జరిగితే 108కి ఫోన్ చేయండి

- ఉమ్మడి అనంతపురం జిల్లా 108 డీఎం సంజీవరెడ్డి

కూడేరు: ఎక్కడైనా ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు, ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే 108 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చునని ఉమ్మడి అనంతపురం జిల్లా 108 డీఎం సంజీవరెడ్డి అన్నారు. కూడేరు మండలం ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–7వ ఎన్‌సీసీ శిక్షణా తరగతుల్లో 108 సేవలపై క్యాడెట్లకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకున్నా, గర్భిణీలు పురిటి నొప్పులతో బాధపడుతునా, ఎవరైన ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నా, ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందిగా ఉన్నప్పుడు 108 నంబర్‌కు కాల్ చేస్తే వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రాథమిక వైద్యం అందిస్తూ ఆస్పత్రికి చేరుస్తారన్నారు. కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు, 108 ఈఎంటీ తిప్పేస్వామి, పైలట్ నాగరాజు, ఓతూలు పాల్గొన్నారు.

సరైన వైద్యం అందక చిన్నారి మృతి

- కేఆర్ చిన్న పిల్లల ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన


మృతి చెందిన బాలుడిని ఒడిలో పెట్టుకుని రోదిస్తున్న కుటుంబ సభ్యురాలు

మడకశిర: స్థానిక అమరాపురం రోడ్డులోని కేఆర్ చిన్న పిల్లల ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాలుగు నెలల బాలుడు మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. వైద్యం సకాలంలో అందకపోవడంతోనే తమ బిడ్డ మృతి చెందాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం శంకరగల్లు గ్రామానికి చెందిన ఓబులేసు, కళావతి దంపతులు తమ 4 నెలల వయసున్న కుమారుడు సరిగా పాలు తాగకపోవడంతో సోమవారం సాయంత్రం కేఆర్ చిన్న పిల్లల ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. బాబును పరీక్షించిన డాక్టర్ సతీష్ వైద్యం అందించారు. మరుసటి రోజు ఉదయం తిరిగి రావాలని సూచించడంతో, ఆ మేరకు మంగళవారం మధ్యాహ్నం మళ్లీ ఆస్పత్రికి వచ్చారు. దీంతో వైద్యుడు చిన్నారికి మళ్లీ వైద్యం చేశారు. కొద్ది సమయం తర్వాత బాబును ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించడంతో తల్లిదండ్రులు హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందారని వైద్యులు తెలిపారు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు, బంధువులు ప్రైవేట్ ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. డాక్టర్ సరైన వైద్యం అందించలేదని వాగ్వాదానికి దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రైవేటు ఆస్పత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై డాక్టర్ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా... చిన్నారి శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుంటే ఆక్సిజన్ పెట్టామని, మరోసారి ఆక్సిజన్ పెట్టాలని కుటుంబ సభ్యులకు తెలిపామన్నారు. అయితే బాలుడికి తల్లిపాలు ఇచ్చే సమయంలో శ్వాస తీసుకోవడంతో సమస్య ఏర్పడిందని, దీంతో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యానికి రెఫర్ చేశామన్నారు. మార్గమధ్యలో బాలుడు మృతి చెంది ఉండవచ్చని.. ఇందులో తమ నిర్లక్ష్యం లేదన్నారు.

పకడ్బందీగా వికలాంగుల హక్కుల చట్టం అమలు : ఎస్పీ

పుట్టపర్తి అర్బన్: వికలాంగుల హక్కుల చట్టాలను మరింత పకడ్బందీగా అమలు చేయాలని, వీటి కోసం ప్రత్యేక సెషన్స్ కోర్టులు పనిచేస్తున్నాయని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. వికలాంగుల హక్కుల చట్టం–2016 పుస్తకాన్ని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, భూగర్భ జల వనరుల శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డితో కలసి మంగళవారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. వికలాంగులపై దాఖలైన నేరాలను విచారించడానికి ప్రత్యేక సెషన్స్ కోర్టులు ఉన్నాయన్నారు. ఈ వివరాలతో పాటు కోర్టులకు అనుబంధంగా ఉన్న స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం, వికలాంగుల సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వివరాలన్నీ పుస్తకంలో పొందు పరిచారన్నారు. ఈ పుస్తకంలోని అంశాలను చదివి హక్కులపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

తపాలా శాఖ ఉద్యోగి ఆత్మహత్య

ముదిగుబ్బ: మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన తపాలా శాఖ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉప్పలపాడు నివాసి పొన్నూరు రామకృష్ణయ్య(52) ముదిగుబ్బలో నివాసం ఉంటూ తపాలా శాఖలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్)గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే కూరగాయల నర్సరీను ఏర్పాటుకు రూ.12 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక మంగళవారం ఉదయం కదిరి రైల్వే గేట్ సమీపంలో క్రిమి సంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయనను స్థానికులు గుర్తించి, వెంటనే 108 అంబులెన్స్ ద్వారా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేడు 'షీప్' యూనియన్ మహాజన సభ

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ మహాజన సభ బుధవారం ఏర్పాటు చేయనున్నట్లు త్రీమెన్ కమిటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కేపీఎల్ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సీడీసీ నిధుల మంజూరు, పెండింగ్ బకాయిల వసూళ్లు, గొర్రెల పెంపకందారుల కష్టనష్టాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, గ్రామ స్థాయిలో సొసైటీల ఏర్పాటు, సంఘాలకు ఎన్నికల నిర్వహణ, ఆడిట్, కొత్త సభ్యుల చేరిక తదితర అంశాలపై చర్చించనున్నారు. అనంతపురంలోని పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే మహాజన సభకు రెండు జిల్లాలకు చెందిన సంఘాల అధ్యక్షులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

మహిళను గాయపరిచి బంగారు నగల అపహరణ

కొత్తచెరువు: ఒంటరిగా ఉన్న మహిళను గాయపరిచి ఆమె వద్ద ఉన్న బంగారు నగలను అపహరించుకెళ్లిన ఘటన కొత్తచెరువులో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు.. పుట్టపర్తిలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న లక్ష్మికి పరిచయస్తుడైన శ్రీనివాసులు మంగళవారం ఉదయం తాను కొత్తచెరువు చెరువు కట్ట వద్ద ఉన్న గంగమ్మ గుడి ప్రాంతంలో ఉన్నట్లుగా సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమె ఆ ప్రాంతానికి చేరుకుంది. ఆ సమయంలో ఒంటరిగా ఉన్న ఆమెపై దుండగులు దాడి చేసి, మెడలోని గొలుసు, చెవి కమ్మలు, నగదు లాక్కొని ముళ్లపొదల్లోకి తోసి వెళ్లారు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న లక్ష్మిని పారిశుద్ధ్య కార్మికులు గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆమెను ముళ్ల పొదల నుంచి వెలికి తీశారు. అనంతరం ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాంట్రాక్టర్ వేతనం ఇవ్వడం లేదు

- చర్యలు తీసుకోవాలంటూ తాగునీటి పథకం కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు

అనంతపురం అర్బన్: ఐదు నెలలుగా తమకు వేతనం ఇవ్వకుండా శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నిర్వహణ కాంట్రాక్టర్ వేధిస్తున్నాడంటూ ఆ తాగునీటి పథకం కార్మికులు మంగళవారం అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు జి.ఓబులు మాట్లాడుతూ... హిందూపురం డివిజన్‌లో కాంట్రాక్ట్ ఏజెన్సీగా ఉన్న ఎస్ఆర్ ఇంజనీరింగ్ అండ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ సంస్థకు చెందిన కాంట్రాక్టర్ ఇక్కడి కార్మికులకు ఐదు నెలలుగా వేతనం ఇవ్వలేదన్నారు. అలాగే 18 నెలలుగా పీఎఫ్ కూడా చెల్లించడం లేదన్నారు. సంస్థ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారన్నారు. అతను మాత్రం బకాయిలు చెల్లించడం లేదన్నారు. అంతే కాక ఒక్కొక్క కార్మికుని వేతనం నుంచి ప్రతి నెలా రూ.2,500 కోత విధిస్తున్నారన్నారు. అలాగే మడకశిర డివిజన్‌లో కార్మికులకు అక్కడి కాంట్రాక్టర్ 14 నెలల పీఎఫ్ చెల్లించలేదన్నారు. ప్రతి కార్మికుని వేతనం నుంచి నెలకు రూ.2,500 చొప్పున కోత విధిస్తున్నారని వివరించారు. నకిలీ కార్మికుల పేర్లతో ప్రతి నెలా రూ.7 లక్షల మేర బిల్లులు చేసుకుంటూ కార్మికుల సొమ్ము కాజేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలపై కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టి కార్మికులకు వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మిక సంఘం అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి హనుమంతు. ఉపాధ్యక్షుడు సోమశేఖర్, సంయుక్త కార్యదర్శి మంజు, నాయకులు నాగభూషణం, గోపాల్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

ధర్మవరం అర్బన్: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని దుర్గానగర్‌కు చెందిన వెంకట్రాముడు భార్య తలారి దుర్గమ్మ (40) చేపల వ్యాపారంతో జీవనం సాగిస్తోంది. కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె మంగళవారం తెల్లవారుజామున నొప్పి తీవ్రత భరించలేక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కుమారులున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ధర్మవరంలో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పోలింగ్ కేంద్రాల స్థితిగతులు పరిశీలించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని, ఇక పోలింగ్ కేంద్రాల స్థితిగతులను పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులను పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి యువతీయువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జీరో డోర్ నెంబర్లు, ఒకే డోర్ నెంబర్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉన్నా, వంద సంవత్సరాలు పైబడి వయసు ఉన్న ఓటర్ల వివరాల సవరణలు, తదితరాలను బీఎల్ఓ యాప్‌తో పాటు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. స్వీప్ యాక్టివిటీ కింద డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ప్రతి ఒక్కరూ పరిశీలించి వాస్తవ స్థితిపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ నివేదిక ఆధారంగానే మౌలిక వసతుల కల్పన ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు నవీన్‌కుమార్, రాంనాథరెడ్డి, మనోజ్‌కుమార్, డివిజనల్ అధికారి జిలానీ, ఎన్నికల డీటీ నరసింహులు, హరి, కృష్ణ, రహమాన్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి


మృతి చెందిన గిరిధర్‌బాబు

బొమ్మనహాళ్: మద్యం తాగవద్దని భార్య మందలించడంతో ఆత్మహత్యకు యత్నించిన భర్త చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో చోటు చేసుకుంది. బొమ్మనహాళ్ ఎస్‌హెచ్‌ఓ హనుమంత నాయక్ తెలిపిన వివరాల మేరకు.. గిరిధర్ బాబు (31) మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై ఈనెల 9న భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లింది. మనస్థాపానికి గురైన గిరిధర్‌బాబు ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ఉరి తాడుకు వేలాడుతున్న గిరిధర్‌బాబును కిందకు దింపారు. అప్పటికి అతడు బాగుండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి సమయంలో గొంతువాపు రావడంతో ఉదయమే బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య అనుష, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

బొగ్గు తయారీదారులపై చర్యలకు సిద్ధం

- నీటి పారుదల శాఖ డీఈ వెంకటరమణ

సాక్షి ఎఫెక్ట్..


మామిళ్లపల్లి వద్ద కుంటలో బొగ్గు బట్టీలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కనగానపల్లి: చెరువులు, కుంటల్లో ఉన్న చెట్లను కొట్టి అక్రమంగా బొగ్గుగా మార్చి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోబోతున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ వెంకటరమణ స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'పచ్చదనం బొగ్గుపాలు' కథనంపై ఆయన స్పందించారు. మంగళవారం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లో పర్యటించి చెరువులు, కుంటల్లో చెట్లు కొట్టి బొగ్గు తయారు చేస్తున్న బట్టీలను పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉండే చెరువులు, కుంటల్లో అనుమతి లేకుండా చెట్లను కొట్టి బొగ్గుగా మార్చడం చట్ట వ్యతిరేకమన్నారు. దీనివల్ల పచ్చదనం అంతరించి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. బొగ్గు బట్టీలను సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట మండల ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

గుంతకల్లులో ఎస్‌సీఆర్ ఏజీఎం సుడిగాలి పర్యటన


స్టేషన్ యార్డు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్‌సీఆర్ ఏజీఎం ధనుంజయులు

గుంతకల్లు: దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ధనుంజయులు సోమవారం గుంతకల్లులో సుడిగాలి పర్యటన చేశారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో విచ్చేసిన ఆయనకు గుంతకల్లు డివిజన్ అధికారులు ఘనస్వాగతం పలికారు. ఏడీఆర్ఎం సూర్యనారాయణతో కలసి గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. క్యాంటీన్లు, ప్రయాణికులు విశ్రాంత గదులు పరిశీలించి, అక్కడున్న ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం స్టేషన్ యార్డును తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన నంచర్ల–మల్లప్ప గేట్ బైపాస్ రైల్వే మార్గంలోని మల్లప్పగేట్ క్రాసింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఆ మార్గంలోని సిగ్నల్ పాయింట్ల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని ఉద్యోగులకు సూచించారు. అనంతరం డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సాయంత్రం రైల్వే క్లబ్‌లో డీఆర్ఎం మనీష్ అగర్వాల్, ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ధర్మవరం రైల్వే స్టేషన్ యార్డులో ఫేజ్–2 కింద చేపట్టబోయే పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, సీనియర్ డీఎఫ్ఎం అక్కిరెడ్డి, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖపై నమ్మకాన్ని నిలబెట్టాలి: ఎస్పీ మాధవరెడ్డి


ఎస్పీని కలిసిన కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు నిబద్ధతతో సేవలు అందించి పోలీస్ శాఖపై నమ్మకాన్ని నిలబెట్టాలని ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా బాధ్యతలు చేపట్టిన కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, హిందూపురం, రొద్దం ఎస్ఐలు మంగళవారం సాయంత్రం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్ అధికారి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

మోదీని కూడా ప్రశ్నించాలి

- టీడీపీ నేత బీకే పార్థసారథి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఒక్కరే దోషి కాదని, అంతకు ముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా రూ.500 కోట్లు వ్యయం చేసిన ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీని ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీకే పార్థసారథి డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్‌హాలులో ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నడుస్తోందన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ విచారణ చేపట్టి దోషులను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య


మాతాశిశు మరణాలపై సమీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణయ్య

ప్రశాంతి నిలయం: మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య ఆదేశించారు. ఇటీవల జిల్లాలో జరిగిన రెండు మాతృ, మూడు శిశు మరణాలపై వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. మరణాలకు గల కారణాలను ఆరా తీశారు. మాతాశిశు మరణాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ నేపథ్యంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గర్భిణి వివరాలు 12 వారాల్లో రిజిస్టర్ చేసి, ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు, ఇతర సేవలందించేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత వైద్యాధికారులదేనన్నారు. హైరిస్క్ కేసుల పట్ల మరింత శ్రద్ధ తీసుకుని, ఆస్పత్రుల్లో సుఖ ప్రసవం జరిగేలా చూడాలన్నారు. రవాణాకు సంబంధించి 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా థామస్, గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మలత, చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ జోయెల్ వెస్లీ, వివిధ మండలాలకు చెందిన పీహెచ్‌సీ వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్లు, సూపర్ వైజర్లు, ఆశ, ఆరోగ్య, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఐఏబీ సమావేశం

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీ ఆయకట్టుకు కీలకమైన సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఈ నెల 14న అనంతపురంలోని కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నీటి కేటాయింపులపై ప్రధానంగా చర్చించనున్నట్లు వివరించారు. హెచ్చెల్సీ పరిధిలోని అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన సాగునీటి సలహా మండలి సభ్యుల (ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీ)ందరూ హాజరవుతారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకం

- రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్


ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

మడకశిర రూరల్: ఎలాంటి రసాయనాలు వాడని ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకంగా మారిందని రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతులు పెద్ద ఎత్తున ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో అంతర్జాతీయ జర్నలిస్టులు సునీతా నారాయణ్, ఢిల్లీకి చెందిన క్రిస్టియన్ గ్రేప్, జర్మనీకి చెందిన రాజ్ పటేల్, అమెరికాకు చెందిన ప్రణయ్ తదితరులు మడకశిర మండలంలోని ఆమిదాలగొంది, కొత్తలం, గౌడనహళ్ళి గ్రామాల్లో పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు సాగు చేసిన పంటలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడి పంటల సాగులో అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలుసుకున్నారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ఆంధ్రప్రదేశ్ రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారని విజయకుమార్ బృందం సభ్యులకు వివరించారు. మడకశిర డివిజన్‌లో దాదాపు 100 గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సాగు చేసి ఆదాయం పొందుతున్నారని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ బృందం సభ్యులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో కాలుష్యం తగ్గి భూమి కూడా సారవంతమవుతుందన్నారు. అందువల్ల రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రకృతి వ్యవసాయం వైపు వారిని మళ్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ భానుమతి, ఎస్ఆర్‌పీ నరేంద్ర, డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, ఎంపీపీ కవిత, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.